# 'తెలుగు భాష భలే తేలిక'



ఆస్టిన్ : 'ఎప్పటికైనా తెలుగు మాట్లాడగలనా అని సంవత్సరం క్రితం వరకూ అనుకునే వాడిని. తెలుగు ఎంతో కష్టం అనీ, నేర్చుకోవడం తేలిక కాదనీ అందరూ బెదరించారు. అయితే, అదంతా వట్టి భయమే. తెలుగు నేర్చుకోవడం ఎంతో తేలిక. ఈ విషయం ఇక్కడ తెలుగు కోర్స్ చేశాక నాకు అర్థం అయింది. ఇప్పుడు తెలుగంటే నాకు అమితమైన ప్రేమ. తెలుగు నేర్చుకోవడం వ్యక్తిగతంగా నేను గొప్ప విజయం సాధించిన అనుభూతిగా ఉంది' అన్నాడు ఈ సంవత్సరపు ఉత్తమ విద్యార్థిగా తానా అవార్డు గెలుచుకున్ బ్రైస్ రాబిన్సన్. మరో విద్యార్థిని ప్రియా కుమార్ ఎలిజబెత్ కూడా ఈ అవార్డు గెలుచుకుంది. అమెరికాలోని ఏ విశ్వవిద్యాలయంలో అయినా అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులో ప్రతి విద్యార్థి నాలుగు సెమిస్టర్లు ఒక భాషా కోర్సు చేయాలి. అలా ఆస్టిన్‌లోని టెక్సస్ యూనివర్శిటీ బిజినెస్ స్కూల్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్స్‌లో ఉన్న బ్రైస్ దృష్టి తెలుగు భాష వైపు మళ్లింది. ఈ విద్యార్థులిద్దరికీ తెలుగు దినోత్సవ సభలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వి.సి. ఆవుల మంజులత చేతుల మీదుగా తానా సంస్థ తెలుగు అవార్డులను ప్రదానం చేసింది.

ఇక ప్రియా కుమార్ ఎలిజబెత్ కథ మరింత ఆసక్తికరంగా ఉంది. ప్రియ తండ్రి ఆంధ్రుడు. తల్లి లండన్‌కు చెందినవారు. తాను ఎలాగైనా తెలుగు నేర్చుకొని ఆంధ్రలో ఉన్న నాన్నమ్మతో, ఇతర కుటుంబ సభ్యులతో తెలుగులోనే మాట్లాడాలన్నది ఆమె ప్రగాఢమైన ఆకాంక్ష. తెలుగు నేర్చుకోవడం ఎలా అని ఆలోచిస్తూ ఒక రోజు సరదాగా టెక్సస్ వర్శిటీ కోర్సుల జాబితాపై ఆరా తీసింది. ఆ జాబితాలో తెలుగు అనే కోర్సు కనిపించగానే ఎగిరి గంతేసినంత పనిచేసింది. ఇక ఆలస్యం చేయకుండా వెంటనే కోర్సులో చేరిపోయింది. 'కాని, తెలుగు కోర్సులో చేరుతున్నప్పుడు నాకు కొండంత భయం వేసింది. అప్పటికి నాకు తెలుగులో రెండే పదాలు తెలుసు. ఒకటి నానమ్మ, రెండు పిల్లి. ఒక సెమిస్టర్ కూడా పూర్తి కాకుండానే ఇప్పుడు నేను తెలుగులో మాట్లాడుతున్నాను. రాస్తున్నాను. తెలుగు చదవగలుగుతున్నాను. ఇది నిజమా, ఇంత త్వరగా తెలుగు నేర్చుకోగలిగానా అని నాకే ఒక్కోసారి ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఈ సారి నేను ఆంధ్రాకు వెళ్ళి నాన్నమ్మతో తెలుగులోనే మాట్లాడగలను' అని సగర్వంగా చెబుతోంది ప్రియ.